26122024-DIS-04_Layout 1 12/26/2024 1:36 AM Page 1



# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**

## రైతాంగం ఆగమాగం

**ఏడాదిలో** ఎంత మార్పు? సమైక్య పాలకులు దండుగన్న వ్యవసాయాన్ని కేసీఆర్ పదేండ్లలో పండుగలా మారిస్తే కాంగ్రెస్ సర్కారు కేవలం 12 నెలల్లోనే అంతా తారుమారు చేసింది. కేసీఆర్ దూరదృష్టితో ప్రవేశపెట్టిన రైతుబంధు పెట్టుబడి సాయాన్ని చిందరవందర చేసింది. అసాధ్యమైన అర్హతలను సాకుగా చూపి లబ్ధిదారులను సగానికిపైగా తగ్గించబోతున్న సంగతి తెలిసిందే. గడిచిన వానకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి అన్నదాతలకు అందించాల్సిన రూ.26 వేల కోట్ల పంట పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టింది. రైతుకూలీలకు సైతం అందిస్తామని చెప్పిన సాయం ఎప్పుడిస్తారో తెలియని పరిస్థితి.

ఇది ఒక పార్శ్వం మాత్రమే. ప్రభుత్వం మీద ఆశలుడిగిపోయి రైతు సొంతంగా పెట్టుబడి సమకూర్చుకొని కిందామీదా పడి సాగు చేసి పంటదీస్తే దాన్ని కొనుగోలు చేసే నాథుడే కరువయ్యాడు. వానకాలం సీజన్‌లో 1.56 కోట్ల టన్నుల ధాన్యం దిగుబడి వస్తే అందులో సర్కారు ఇప్పటివరకు కొన్నది 47 లక్షల టన్నులు మాత్రమే. సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తామనే హామీ బోగస్‌గా మారింది. 50 లక్షల టన్నుల సన్నాల సేకరణ ప్రభుత్వ లక్ష్యం కాగా కొనుగోలు చేసింది 18.78 లక్షల టన్నులు మాత్రమే. తద్వారా తగ్గిన కొనుగోళ్ల వల్ల రైతులకు రూ.1,561 కోట్ల కోత ఏర్పడింది. ఆ కాస్త కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లించాల్సిన మొత్తంలో బకాయిలు పెట్టడం విడ్డూరం. అటు పంట పెట్టుబడి సాయంలో కోత, ఇటు ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం చూపుతూ, ఆలస్యం చేస్తూ రైతులను సర్కారు తీవ్ర వేదనకు గురిచేస్తున్నది.

ఇక రైతు రుణమాఫీ అనేది పెద్ద ప్రహసనంలా మారింది. రూ.2 లక్షల పైచిలుకు రుణాల మాట దేవుడెరుగు, అంతకు లోపు ఉన్న రుణాలను ఆగం పట్టించి, అంతంతమాత్రంగా అమలు చేసింది. తూతూమంత్రం రుణమాఫీతో సరిపెట్టి చేతులు దులిపేసుకుంది. గంపెడాశతో ఎదురుచూసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. భూ యాజమాన్య హక్కులకు రక్షణ కల్పించి, బదిలీని సులభతరం చేసిన ధరణి వ్యవస్థను ధ్వంసం చేసింది. మరింత మెరుగైన వ్యవస్థ తెస్తానని చెప్పి మసిపూసి మారేడుకాయ చేసింది. అంతరించిపోయిన భూ తగాదాలకు తన అనాలోచిత నిర్ణయంతో మరోసారి తెరతీసింది. ప్రాజెక్టులను పడావుపెట్టి సాగునీటి సరఫరాను అస్తవ్యస్తం చేసింది. ఇది రైతులను ఆందోళనకు గురిచేసే అంశమే. మరోవైపు కార్పొరేట్లకు కొమ్ముగాస్తూ పరిశ్రమల పేరుతో భూములు లాక్కొని ఆగమాగం చేస్తున్నది. ఇలా రైతుకు సంబంధించిన అన్ని అంశాల్లోనూ సర్కారు వైఫల్యం, వారి పట్ల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. దీని ఫలితంగా రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. చరిత్రలో కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తామని బీరాలు పలికే సర్కారు.. పుస్తకాల్లో పేజీలు చింపేసి తృప్తి పడుతున్నది. రైతు సమస్యల పరిష్కారంపై ఆ మాత్రం శ్రద్ధ పెడితే రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతుంది.

# మరి, ఈ చావులకు బాధ్యులెవరు?



కనకదుర్గ దంటు
89772 43484

**వ్యతిరేకుల మీద కేసులు పెట్టినప్పుడు రాజకీయ నాయకులు తరచూ చెప్పే మాట 'చట్టానికి చుట్టాలుండరు, చట్టం తన పని తాను చేసుకుపోతుంది, చట్టం దృష్టిలో అందరూ సమానులే'. వినటానికి, నమ్మటానికి ఇది చాలా బాగుంటుంది. మరి ఆచరణలో అలాగే జరుగుతుందా? ఏదైనా అనుకోని బలవన్మరణం, యాక్సిడెంట్ జరిగినప్పుడు ఎవరి వల్ల జరిగిందో వారే బాధ్యులని చెప్పుంటారు. కానీ, ఇప్పుడు అన్ని టీవీ చానళ్లలో మార్మోగుతున్న మాటలు, కథనాలు, చర్చలు అల్లు అర్జున్ సంధ్య థియేటర్‌కు వెళ్లినప్పుడు జరిగిన ఘటన చుట్టూ తిరుగుతున్నాయి. రాజధానిలోని అసెంబ్లీ నుంచి, మారుమూల పల్లెటూరులోని గల్లీ వరకు వాదోపవాదాలు జరుగుతున్నాయి. కేసు కోర్టు దాకా వెళ్లింది. కాబట్టి, న్యాయమూర్తులు న్యాయంగా తీర్పు చెప్తారని ఆశిద్దాం!**

మరి రాజకీయ నాయకుల నేతృత్వంలో నడిచే ప్రభుత్వాల వల్ల నష్టపోయిన ప్రజల కష్టాలకు, వారి చావులకు కారకులెవరు? ఇవి చర్చించే విషయాలు కావా? అవేమిటో ఇప్పుడు చూద్దాం! చరిత్రను ఒకసారి పరికించి చూస్తే 1329లో గజనీ మహమ్మద్ తన రాజధానిని ఢిల్లీ నుంచి దేవగిరి పట్టణానికి మార్చాడు. అంతేకాదు, దానికి దౌలతాబాద్ అని పేరు కూడా పెట్టాడు. అయితే అక్కడి ప్రజలతోనే ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయకుండా ఢిల్లీ నుంచి అధికారులతో పాటు వేల మంది ప్రజలను కూడా తరలించాడు. దీంతో అధికారులతో పాటు సామాన్య ప్రజలు కూడా అనారోగ్యం పాలయ్యారు. అంతేకాదు, వారిలో చాలామంది చనిపోయారు. దీనికి ఎవరు బాధ్యత వహించాలి? పాలకుడిని కూడా శిక్షించగలిగిన న్యాయస్థానం ఉంటే కేసు వేయవచ్చా? ఆలోచనలు బాగానే ఉన్నా, వాటి ఆచరణ సరిగ్గా లేకపోవంతో మహమ్మద్ బిన్ తుగ్లక్ 'పిచ్చి తుగ్లక్' అన్న బిరుదు తెచ్చుకున్నాడు. ఇప్పటికీ ప్రజల్లో 'తుగ్లక్ పనులు' అన్న నానుడి వాడుకలో ఉన్నది.

**ఇక, ఇప్పుడు జరుగుతున్న సంఘటనలు విశ్లేషిద్దాం.**

1. పాఠశాలల్లో చదువుకునే చిన్న పిల్లలకు, భవిష్యత్తు మేధావులకు 2023 డిసెంబర్ దాకా నాటి ప్రభుత్వం సన్నబువ్వ, పుష్టికరమైన వంటకాలతో భోజనం పెట్టి ప్రభుత్వ పాఠశాలల స్థాయిని పెంచింది. ఆ ప్రభుత్వం మారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ పాఠశాలల్లో పురుగుల బియ్యం, కుళ్లిపోయిన కూరలతో భోజనాలు పెడుతుండటంతో దాదాపు 1122 మంది విద్యార్థులు ఆస్పత్రుల పాలయ్యారు. వారిలో 57 మంది చనిపోయారు. ఈ చావులకు ఎవరు బాధ్యులు? ఎవరి మీద కేసు వేయాలి?



2. నేటి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాల్లో అర్థం పర్థం లేని పథకం ఏదంటే.. 'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం'. ఇది రాష్ట్రంలో అమలవుతున్నప్పటి నుంచి సమాజం అతలాకుతలమవుతున్నది. ఇంట్లో ఖాళీగా ఎందుకు ఉండటం అని ఉద్యోగాలు చేయని మహిళలు రోజూ అటు ఇటూ తిరుగుతుండటంతో చదువుకునే విద్యార్థినీ విద్యార్థులకు, ఉద్యోగస్థులకు బస్సు ప్రయాణం నరకంగా మారింది. అంతేకాదు, ఈ పథకం చౌక ప్రయాణానికి అనువుగా ఉండే ఆటో డ్రైవర్ల పొట్ట కొట్టింది. సంపాదన లేక, ఆటోల ఈఎంఐలు కట్టలేక నిరాశ చెంది 95 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకున్నారు. వారి కుటుంబాలు వీధినపడ్డాయి. ఈ చావులకు ఎవరు బాధ్యులు, ఎవరి మీద కేసు వేయాలి? ఏ ఆస్తులు లేని వీరి కుటుంబాలకు ఎవరు దిక్కు?

3. **వలస పాలకుల నుంచి తెలంగాణ ప్రాంతానికి 2014లో విముక్తి కలిగింది. నాటినుంచే రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీ పాలన మొదలైంది. క్రమంగా సామాన్య ప్రజలకు ఉపయోగకరమైనవి, వారి జీవన ప్రమాణాలు పెంచే పథకాలు రాష్ట్రంలో అమలయ్యాయి. 2014 నుంచి 2023 దాకా రైతుల ఆత్మహత్యలు లేకపోవడమే కాదు, దురదృష్టవశాత్తూ ఎవరైనా మరణిస్తే, ఆ రైతు కుటుంబానికి రూ.5 లక్షలు రొక్కం అందించి ఆ రైతు కుటుంబాన్ని నాటి ప్రభుత్వం ఆదుకున్నది.**

అప్పటి వసతులు, అప్పటి పథకాలు ఇప్పుడు లేవు. అప్పుడున్న కరెంటు ఇప్పుడు లేదు. నీళ్లకు కటకట మొదలైంది, రుణమాఫీ పథకం సరిగా అమలుకావడం లేదు. ఫలితంగా 2024లో 362 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ చావులకు ఎవరు బాధ్యులు? ఎవరి మీద కేసులు వేయాలి?

4. 2023, డిసెంబర్ 7 నుంచి నేతన్నలకు బతుకమ్మ చీరలు నేసే అవకాశమే రాలేదు. ఇక ఇప్పుడు, తెలంగాణ తల్లి చేతుల్లోంచి బతుకమ్మ కూడా మాయమైంది. ముమ్ముందు కూడా బతుకమ్మ చీరలు నేసే అవకాశం నేతన్నలకు వస్తుందనే ఆశ కూడా లేదు. ప్రభుత్వ నిరాసక్తత, పట్టింపులేని తనంతో 31 మంది చేనేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ మరణాలకు బాధ్యులెవరు? ఎవరి మీద కేసులు వేయాలి?

5. డీనోసార్ వలె అకస్మాత్తుగా నగరంలో హైడ్రా క్రేన్స్ ప్రత్యక్షమయ్యాయి. తమ కష్టార్జితంతో కట్టుకున్న పేదల ఇండ్లు అవి కూల్చివేయడంతో వేల కుటుంబాలు, చిన్న చిన్న వ్యాపారులు రోడ్డున పడ్డారు. ఈ దురాగతాన్ని చూడలేక ఇద్దరు, ముగ్గురు వ్యక్తులు గుండెపోటుతో మరణించారు. ఈ మరణాలకు ఎవరు బాధ్యులు?

ఇంకా కుక్క కాట్లు, పాము కాట్లు, రోడ్డు ప్రమాదాలు, నేరగాళ్ల వల్ల చనిపోయినవారు ఎందరో? వారు ఎవరిని నిలదీయాలి? ఎవరి మీద కేసులు పెట్టాలి? ఇవేకాదు, ప్రభుత్వ అండతో రైతుల పంట పొలాలు లాక్కోవాలని, ఇతర స్థలాలను కబ్జాలు చేస్తూ సామాన్య ప్రజలను ఇక్కట్ల పాలు చేస్తున్న వారి మీద ఎవరు యాక్షన్ తీసుకుంటారు? సామాన్య ప్రజలను పట్టి పీడిస్తున్న వారిని ఎవరు శిక్షిస్తారు? వాటికి సమాధానం చెప్పేది ప్రభుత్వమే కదా? ప్రజా పాలన అంటే ప్రజలను గాలికి వదిలేయటమేనా? టర్కిష్ భాషలో ఒక సామెత ఉన్నది. 'ఒక వ్యక్తిని తీసుకువచ్చి రత్నాల సింహాసనం మీద కూర్చోబెడితే, ఆయనకు ఆ రత్నాల విలువ, ఆ సింహాసనం బాధ్యత ఏం తెలుస్తుంది? పైగా ఆ వ్యక్తి తన చుట్టూ ఉన్న వారందర్నీ అనామకులను చేస్తాడు. ఎందుకంటే ఆయన స్థాయి మాత్రమే ఆయనకు తెలుసు కాబట్టి.

**ఇంకా కుక్క కాట్లు, పాము కాట్లు, రోడ్డు ప్రమాదాలు, నేరగాళ్ల వల్ల చనిపోయినవారు ఎందరో? వారు ఎవరిని నిలదీయాలి? ఎవరి మీద కేసులు పెట్టాలి? ఇవేకాదు, ప్రభుత్వ అండతో రైతుల పంట పొలాలు లాక్కుంటూ, ఇతర స్థలాలను కబ్జాలు చేస్తూ సామాన్య ప్రజలను ఇక్కట్ల పాలు చేస్తున్న వారి మీద ఎవరు యాక్షన్ తీసుకుంటారు? సామాన్య ప్రజలను పట్టి పీడిస్తున్న వారిని ఎవరు శిక్షిస్తారు? వాటికి సమాధానం చెప్పేది ప్రభుత్వమే కదా? ప్రజా పాలన అంటే ప్రజలను గాలికి వదిలేయటమేనా?**

# బంధులన్నీ బంద్

**ఉమ్మడి పాలనలో గోస పడ్డ ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించి తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపారు కేసీఆర్. అంతే కాదు, సబ్బండ వర్గాలకు ఫలాలను అందించేందుకు 'బంధు' పేరిట పలు పథకాలను ప్రారంభించారు.**

సాగును బాగు చేసేందుకు 'రైతుబంధు'పై ఎకరాకు ఏటా రూ.10 వేలు అందించారు. చనిపోయిన అన్నదాతల కుటుంబాలకు 'రైతుబీమా' ద్వారా రూ.5 లక్షలు సాయం చేశారు. 24 గంటల పాటు ఉచిత కరెంటు ఇచ్చి కర్షకులకు ఆదెరువయ్యారు. సమాజంలో అత్యంత పీడనకు గురైన సమాజాన్ని ఆదుకునేందుకు 'దళిత బంధు' పేరిట ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షలు ఇచ్చి వారిని వ్యాపారులను చేశారు. వెనుకబడిన తరగతుల అభ్యున్నతి కోసం బీసీ బంధు ద్వారా ఆర్థిక సాయం చేశారు. గొల్ల, కురుమ సోదరులకు 'గొర్రెల పంపిణీ', మైనార్టీ సోదరులకు 'మైనార్టీ బంధు' ఇచ్చారు. గర్భిణులకు కేసీఆర్ కిట్‌తో పాటు రూ.11 వేలు సాయం చేశారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్ ఇచ్చి వారికి బంధువయ్యారు.

కానీ, మార్పు పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనలో బంధులన్నీ బంద్ అయిపోయాయి. మాటల గారడీతో అధికారం చేజిక్కించుకున్న హస్తం పార్టీకి పైరవీల కోసం ఢిల్లీకి పోవడం, కూల్చివేతలు, అక్రమ కేసులు తప్ప ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన లేదు. ఈ నేపథ్యంలో తన పథకాల రూపంలో ప్రజల మనసుల్లో ప్రజా బంధువు గా మారిన కేసీఆరే మళ్లీ రావాలని అందరూ కోరుకుంటున్నారు.



- కూనూరు శ్రీనివాస్ గౌడ్
96405 42509
(వ్యాసకర్త: న్యాయవాది)

# ఇంకా వదలని సమైక్య బానిసత్వం



నర్సన్ బద్రి
94401 28169

**రేవంత్‌రెడ్డి రాజకీయ ఎదుగుదల తెలుగుదేశం పార్టీతోనే ప్రారంభమైంది. 2007 నుంచి పదేండ్ల పాటు ఆయన అదే పార్టీలో కొనసాగుతూ వివిధ పదవులు చేపట్టారు. తెలంగాణ వచ్చాక 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆయన టీడీపీ తరపున కొడంగల్‌లో నిలబడి గెలిచారు. అసెంబ్లీలో అదే పార్టీకి ఫ్లోర్ లీడర్‌గా ఉన్నారు. తెలంగాణలో కొత్తగా ఏర్పడిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని 2015 మే నెలలో కూలదోసేందుకు ఎమ్మెల్సీ కొనుగోలు అభియోగంపై ఆయన అరెస్టు అయ్యారు. ఇదంతా చంద్రబాబు డైరెక్షన్‌లో జరిగిందనడానికి ఆడియో సాక్ష్యాలు దొరికాయి. అప్పుడు ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు మధ్య సంబంధాలు బాగా లేవు. ఈ కేసు నేపథ్యంలో ఇద్దరు ఒకే పార్టీలో ఉంటే క్షేమం కాదని చంద్రబాబు ఆలోచించి రేవంత్‌ను కాంగ్రెస్‌లోకి పంపారు.**

రేవంత్, చంద్రబాబుల మధ్య ఉన్న గురుశిష్యుల బంధం వారి వ్యక్తిగతానికే పరిమితం కావాలి. అంతేతప్ప, రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగించకూడదు. అయితే రెండు తెలుగు రాష్ట్రాలు తన చేతిలోనే ఉన్నాయన్నట్టు చంద్రబాబు సరళి కనిపిస్తున్నది. జూలై 6న పూలే భవన్‌కు వచ్చిన బాబుకు దక్కిన స్వాగతం చూస్తే.. ఓ ప్రైవేటు కంపెనీ బాస్ సందర్శనకు వస్తే ఉద్యోగులంతా వినమ్రతను ప్రదర్శించినట్టుంది. పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి రావడం మామూలు విషయమే. అదీ మరో పార్టీకి చెందినవారైతే సాధారణంగా పట్టించుకోరు. రాష్ట్ర పునర్విభజన చట్టం, 2014లో మిగిలిపోయిన అంశాల గురించి చర్చించేందుకేనని చంద్రబాబు చెప్పి మరీ హైదరాబాద్‌కు వచ్చారు. నిజానికి, ఆ అంశాల గురించి తేల్చుకునేందుకు రెండు రాష్ట్రాల అధికారులు చాలు. మరోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవి చేపట్టిన చంద్రబాబు తొలిసారిగా జూలై 5న హైదరాబాద్‌కు వచ్చారు. బేగంపేట్ ఎయిర్‌పోర్ట్ నుంచి ర్యాలీ, గజమాల, టీడీపీ వర్గాల హంగామా తెలంగాణ ప్రజలను




ఆశ్చర్యపరిచింది. హైదరాబాద్ వీధుల్లో మళ్లీ 'జై టీడీపీ, జై జై బాబు' నినాదాలు ఏమిటని స్థానికులు విసుక్కున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రిని కలవడానికి వస్తే మామూలుగానే వచ్చిపోవచ్చు. కానీ, 'శిష్యుని పాలనలో తెలంగాణలో తన లెవల్ చూడండి' అన్నట్టు విపక్షాలకు, తెలంగాణ వాదులకు సవాలు విసిరినట్టుగా ఆయన ధోరణి కనబడింది.

తెలంగాణపై చంద్రబాబు పెత్తనాన్ని రుజువు చేసే సంఘటన మరొకటి ఈ నెల 20న జరిగింది. హైదరాబాద్ ఓఆర్ఆర్ వద్ద వంద అడుగుల ఎన్టీ రామారావు విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు సీఎం రేవంత్ అనుమతి ఇచ్చినట్టు పత్రికల్లో వచ్చింది. ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని నెలకొల్పాలని ఎన్టీఆర్ నాలెడ్జి సెంటర్ భావించింది. అందులో తప్పేం లేదు. అయితే, ఆ విగ్రహాన్ని తెలంగాణలో ఏర్పాటు చేయడమే మింగుడుపడని విషయం. ఎన్టీఆర్ లిటరరీ కమిటీ, ఆయన కుమారుడు మోహనకృష్ణ, మంత్రి తుమ్మల తదితరులు సీఎంను కలిసి స్థలం కావాలని కోరగా.. అందుకు రేవంత్ అంగీకరించారు. ముఖ్యమంత్రి స్థానంలో రేవంత్ కాకుండా మరెవరున్నా ఇందుకు ఒప్పుకొనేవారు కాదు. ఈ నిర్ణయం తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు విరుద్ధం. చంద్రబాబు పంపారు, రేవంత్ జీ హుజూర్ అన్నారు అన్నట్టు ఉంది ఈ తతంగమంతా.

అసలు తెలంగాణతో ఎన్టీఆర్‌కు సంబంధమేంటి? ఆయన విగ్రహ ఏర్పాటుకు ప్రభుత్వ స్థలం ఎందుకు ఇవ్వాలి? రాష్ట్రం ఒక వ్యక్తిది కాదు. ఈ విషయంలో మిగతా మంత్రులు, కాంగ్రెస్ పార్టీ పెద్దల అభిప్రాయమేమిటి? అనేది బహిరంగ చర్చకు రావాలి. ఉమ్మడి ఏపీ సీఎంగా ఎన్టీఆర్ తెలంగాణ కోసం ప్రత్యేకంగా చేసిన మేలు ఏమీ లేదు. 'తెలంగాణ ప్రజలు మా కన్నా తక్కువే' అనే భావన, ఆంధ్రా పెత్తనం ఆయనలోనూ ఉండేది. ట్యాంక్‌బండ్ వద్ద విగ్రహాల ఏర్పాటు ఆయన హయాంలోనే జరిగింది. 34 విగ్రహాల్లో 10 మంది కూడా తెలంగాణకు చెందినవారు లేరు. విగ్రహాల ఎంపిక సందర్భంగా మరి కొందరు తెలంగాణవారి పేర్లను సూచిస్తే ఎన్టీఆర్ తిరస్కరించారని జయశంకర్ సార్ ఓ పుస్తకంలో రాసినట్టు తెలుస్తున్నది.

ఇప్పటికే ఖమ్మంలోని లక్కవరం చెరువు వద్ద ఎన్టీఆర్ భారీ విగ్రహ స్థాపన జరిగింది. గతేడాది హైదరాబాద్‌లోని మోతీనగర్‌లో ప్రభుత్వ అనుమతి లేకుండానే ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దాన్ని తొలగించేందుకు మున్సిపల్ అధికారులు, పోలీసులు వెళ్తే టీడీపీ కార్యకర్తలు అడ్డగించారు. చంద్రబాబు పాలనాకాలంలో తెలంగాణవ్యాప్తంగా దాదాపు ఊరూరా ఎన్టీఆర్ విగ్రహాలు ఏర్పాటయ్యాయి. ఇవి ఉండగా కొత్తగా ఎన్టీఆర్ వంద అడుగుల విగ్రహాన్ని తెలంగాణలో నెలకొల్పడం అవసరమా? ఆంధ్రా ప్రాంతానికి చెందిన పెద్దమనిషి విగ్రహాన్ని హైదరాబాద్‌లో నెలకొల్పితే ఆ ఉత్సవాల్లో పాల్గొనేదెవరు? దాని ప్రభావం తెలంగాణపై ఎలా ఉంటుంది? ఏదేదో సాకుతో ఆంధ్రుల ప్రతీకలు తెలంగాణలో పెరుగుతూ పోతే స్వీయ పాలనకు అర్థమేముంది? ఎన్టీఆర్ 100 అడుగుల విగ్రహానికి ప్రభుత్వ స్థలం కేటాయింపుపై తక్షణ నిరసన అవసరం. అంతగా ఏర్పాటు చేయాలనిపిస్తే ఎక్కడైనా స్థలాన్ని కొనుగోలు చేసుకోవాలి. ఔటర్ రింగ్ రోడ్ చుట్టూ భూముల ధరలు పెరిగిపోతున్నాయి. ఎన్నికల హామీలు నెరవేర్చడానికి నిధుల లేమితో ఇబ్బందులు పడుతున్న దశలో విలువైన భూమిని ప్రభుత్వం ఎవరికీ ధారాదత్తం చేయకూడదు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టే ఇలాంటి చర్యలను అందరూ కలిసికట్టుగా నిలదీయాలి.




## పదే పదే తప్పులు చేస్తున్న కాంగ్రెస్!



**2013లో 40 రోజుల ఆప్ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడమే దేశ రాజధాని ఢిల్లీలో కాంగ్రెస్ బలహీనపడటానికి ప్రధాన కారణం. ఆ తప్పును సరిదిద్దుకోకుండానే తాజాగా సార్వత్రిక ఎన్నికల్లోనూ ఆప్‌తో కాంగ్రెస్ జట్టుకట్టింది. పదే పదే జరుగుతున్న ఇలాంటి తప్పలను సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉన్నది.**

**- అజయ్ మాకెన్
కాంగ్రెస్ సీనియర్ నేత**

**తెలంగాణ ఒక విఫల ప్రయోగం కావాలన్నది తెలంగాణ వ్యతిరేకుల స్వప్నం. అందుకోసం వారి అనుంగు అనుచరులను పావులుగా వాడుకుంటూ పైశాచిక ఆనందం పొందుతున్నారు. పైగా అదే నిజమని ప్రజలను భ్రమింపజేస్తున్నారు. తమ విధ్వంసపు ఆలోచనలతో తెలంగాణను ఒక ఫెయిల్యూర్ రాష్ట్రంగా చిత్రీకరించేందుకు పాకులాడుతున్నారు. వారి కోరికలను నిజం చేసే దిశగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అడుగులు వేస్తుండటం ఆందోళనకరం.**

# బజారున మన పరువు



పాశం రఘునందన్ రెడ్డి
72077 70469



**2014**లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అభివృద్ధే ఏకైక ఎజెండాగా పనిచేసింది కేసీఆర్ ప్రభుత్వం. తెలంగాణ వస్తే తమ వ్యాపారాలు ఎక్కడ దెబ్బతింటాయోనని భయపడ్డ ఆంధ్రా ప్రజల అపోహలను తొలగించింది. ప్రత్యర్థులు చేసిన విష ప్రచారాలను పటాపంచలు చేస్తూ అందరి మన్ననలు పొందుతూ సాగిన కేసీఆర్ పాలనలో ప్రజలు ప్రశాంతంగా ఉన్నారు. అందుకేనేమో దేశ నలుమూలల నుంచి పెట్టుబడుల ప్రవాహం వెల్లువెత్తింది. ఆ శ్రమ ఫలితంగానే 2014లో అసెంబ్లీ ఎన్నికలు జరిగిన రెండేండ్ల తర్వాత జరిగిన జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ పార్టీ 99 సీట్లు సాధించింది. ఒక్కో రంగాన్ని బాగు చేసుకుంటూ తెలంగాణను దేశంలో అభివృద్ధికి దిక్సూచిగా కేసీఆర్ నిలబెట్టారు. తెలంగాణపై శీతకన్ను చూపే కేంద్ర ప్రభుత్వమే పార్లమెంట్ సాక్షిగా పలుసార్లు తెలంగాణ రాష్ట్రాభివృద్ధిని పొగిడింది. ఇట్లా విజయవంతంగా దూసుకువెళ్తున్న తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మొత్తం అతలాకుతలం చేసింది. చంద్రబాబు శిష్యుడైన రేవంత్‌రెడ్డికి పాలనా పగ్గాలను కాంగ్రెస్ అప్పగించడంతో ఆయన తెలంగాణను ఒక విఫల రాష్ట్రంగా చూపించే ప్రయత్నం చేస్తున్నారనే అనుమానాలు రోజురోజుకు బలపడుతున్నాయి.

ప్రగతిభవన్ ముందున్న సెక్యూరిటీ కంచె తొలగింపుతో ప్రారంభమైన తెలంగాణ విధ్వంసం హైడ్రా పేరిట పేదలు రోడ్డుమీద పడుతున్నా విధ్వంసం ఆగడం లేదు. రైతులకు పంట సహాయం ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం పంట కొనుగోళ్లు ఆల స్యం చేసి వారిని అరిగోస పెట్టింది. అసంఘటితరంగ కార్మికుల పొట్టకొట్టి ఆత్మహత్యలకు పురిగొల్పింది. ఫుడ్ పాయిజన్ ఘటనలతో విద్యార్థులు మరణిస్తున్నారు. కక్షపూరిత రాజకీయ హత్యలు, దాడులు, సోషల్ మీడియా కేసులతో తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు భయాందోళనలో బతుకుతున్నది.

తెలంగాణ అస్తిత్వాన్ని విచ్ఛిన్నం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం పరాచికాలాడుతున్నది. ప్రభుత్వ లోగో నుంచి చార్మినార్, కాకతీయుల తోరణాన్ని తీసేయబోయి బొక్కాబోర్లా పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం.. తెలంగాణ తల్లిని మార్చింది. ఆ తల్లి నుంచి బతుకమ్మను దూరం చేసింది. ప్రభుత్వ వేదికలపై బతుకమ్మ పాటలు, జానపద గేయాలు మాయమై అశ్లీల పాటలు మార్మోగుతున్నాయి. ఇదంతా చాలదన్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కండ్లు తాజాగా సినీ పరిశ్రమపై పడ్డాయి. ఇరువై రోజుల నుంచి రాష్ట్రంలో ఏం జరుగుతున్నదో ఎవరికీ అర్థం కావడం లేదు. సమస్యలన్నీ పరదా చాటుకుపోయి ఒక్క అంశమే సాగుతున్నది. కోర్టులో తేలాల్సిన ఈ న్యాయపరమైన అంశాన్ని రాజకీయం చేస్తూ రోజుకో కృత్రిమ వివాదంతో తెలంగాణను బద్నాం చేస్తున్నారు. ఇప్పుడు జాతీయస్థాయిలో 'తెలంగాణకు ఏమైంది, ఎందుకీ పిచ్చి వైఖరి' అని దుర్భాషలాడుతున్నారు.

**ఇదంతా గమనిస్తుంటే..
సమైక్య రాష్ట్రంలోని తెలంగాణ వ్యతిరేక ఆంధ్రా నాయకుల స్వప్నం ఫలించేటట్టుగానే కన్పిస్తున్నది. పేరుకు కాంగ్రెస్ పార్టీలో ఉన్నా, చంద్రబాబు శిష్యుడైన సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ నాశనానికి కంకణం కట్టుకొని మరీ కష్టపడుతున్నట్టు కనిపిస్తున్నది.**

రాష్ట్ర ఆవిర్భావ అనంతరం సుమారు పదేండ్ల కాలంలో ఒక్కో రంగాన్ని ఎలా బలోపేతం చేసుకుంటూ వచ్చామో అదంతా, ఒక్క ఏడాదిలోనే గంగలో కలిసింది. అసత్యాలు, దుష్ప్రచారాలు నమ్మిన ప్రజలకు వారేం కోల్పోయారో నెమ్మదిగా అర్థమవుతున్నది. కానీ, ఏం లాభం? అభివృద్ధి పథం లో ముందుకుపోవాల్సిన రాష్ట్రం మరో నాలుగేండ్ల లో ఈ విధ్వంసకారుల చేతుల్లో ఎంత నలిగిపోతుందోననే భయం వెంటాడుతూనే ఉన్నది.